క్లుప్తంగా

ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

కడియం: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను మరింతగా పెంచాలని ఎంపీడీవో రమేష్ ఆదేశించారు. మండల కేంద్రమైన కడియంలో పలు ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచి వేగంగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు బీమా, కూలి సొమ్ము వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

4న బీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య (ఏపీ బీఎస్ఎస్ఎస్) అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మకు ఈనెల 4న రాజమహేంద్రవరంలో అభినందన సత్కారం కార్యక్రమం నిర్వహించనున్నట్టు నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుల్రేవు సూర్య వెంకటరావు తెలిపారు. 4వ తేదీ ఉదయం 10 గంటలకు కుమారి థియేటర్ ఎదురుగా ఉన్న జూపూడి ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న అభినందన సత్కార సభలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు, బ్రాహ్మణ ప్రముఖులు హాజరవుతారన్నారు.

ప్రమాదకరంగా తారు రోడ్డుపై ఇసుక



జీఎంఆర్ గేటు సమీపంలో తారురోడ్డుపై ఉన్న ఇసుక

కడియం: వేమగిరి – కడియం రోడ్డులో జీఎంఆర్ సమీపంలో తారు రోడ్డుపై ఉన్న ఇసుక ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా వేలాది వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. జీఎంఆర్ గేటు సమీపానికి వచ్చేసరికి రోడ్డు మీద ఉన్న ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. దీంతో వాహనం అదుపుతప్పి అనేక మంది ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

జీవో 77 రద్దు చేయాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జీవో 77 రద్దు చేయని పక్షంలో ఈనెల 7న ఐసెట్ పరీక్షను అడ్డుకుంటామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాఘవ మాట్లాడుతూ ప్రభుత్వ పీజీ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు మాత్రమే విద్యా దీవెన, వసతి దీవెన ఇస్తామని చెప్పి ప్రైవేట్ కళాశాలలో పీజీ చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారన్నారు. అనేకమంది పేద విద్యార్థులు ప్రభుత్వ పీజీ కళాశాలలో చదువుకునేందుకు వారికి సీట్లు లేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. జీవో 77ను రద్దు చేసి అందరికీ విద్య అందుబాటులో ఉండే విధంగా చూడాలని, లేనిపక్షంలో ఐసెట్ పరీక్షను అడ్డుకుంటామని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

బంగారు ఆభరణాలతో పరారీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నదిలో మునిగి రావాలని మహిళకు మాయమాటలు చెప్పి ఒక వ్యక్తి బంగారంతో పరారైన ఘటన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసారు. నెల్లూరుకు చెందిన గౌరీబత్తుల నాగభారతికి మ్యారేజ్ బ్యూరో వెబ్‌సైట్‌లో నారాయణ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తనది రాజమహేంద్రవరం అని పరిచయం చేసుకున్నాడు. వీరు ఫోన్‌లో మాట్లాడుకోసాగారు. ఇదిలా ఉండగా నాగభారతికి పిత్రుదోషం ఉందని నారాయణ చెప్పాడు. గోదావరి నదిలో స్నానం చేస్తే దోషం పొంతుందన్నాడు. దీంతో ఆమె గత నెల 20న రాజమహేంద్రరం వచ్చి నారాయణను కలిసింది. అతను నాగభారతిని కోటిలింగాలరేవు వద్దకు తీసుకెళ్లి గోదావరి నదిలో స్నానం చేయమని చెప్పాడు. దీంతో ఆమె వంటిపై ఉన్న 36 గ్రాముల బంగారు నగలు, వెండి వస్తువులు తీసి మూట కట్టి స్నానానికి దిగింది. నాగభారతి స్నానం చేసి వచ్చి చూసేసరికి మూటతో నారాయణ పరారయ్యాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాట శిబిరంపై దాడి

కంబాలచెరువు: స్థానిక టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై శుక్రవారం దాడి చేసి పోలీసులు రూ.55,300 స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌సీఎం చర్చి సమీపంలోని శ్రీహరి అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో దాడి చేసి పోలీసులు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసారు.

పోటీల్లో గెలిచి.. పతకాలు సాధించి..

- చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణిస్తున్న విద్యార్థినులు
- రోప్ స్కిప్పింగ్‌లో ఆల్ ఇండియా ఈవెంట్‌లో ప్రథమ స్థానం
- ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి

సీటీఆర్ఐ: అవకాశాలు అందిపుచ్చుకుంటూ చదువుతోపాటు పలు క్రీడల్లో రాణిస్తూ విద్యార్థినులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. బాలికలు క్రీడా పోటీల్లో తమ ప్రతిభ చాటి పతకాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒక పక్క చదువుకుంటూ మరోపక్క తమ లక్ష్యాన్ని విడవకుండా క్రీడల్లోనూ వారు రాణిస్తున్నారు. స్థానిక ఎస్‌కేఆర్ మహిళా ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థినులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించిన కళాశాల రోప్ స్కిప్పింగ్ జట్టు విభాగంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ టీం ఈవెంట్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అంతేకాకుండా ఆల్ ఇండియా ఓవరాల్ చాంపియన్‌షిప్ ఫర్ ఉమెన్ 2024–25లో మూడవ స్థానంలో నిలిచి కళాశాలకు గర్వకారణమయ్యారు.

కందుకూరి ఆశయాలకు అనుగుణంగా....

కందుకూరి మహిళలను విద్యావంతులను చేయడానికి ఆరోజుల్లోనే వారికి ప్రత్యేక పాఠశాలలు నిర్మించారు. మహిళలు చదువుకుంటే ఇంటికి, దేశానికి అభివృద్ధి వెలుగులు తీసుకొవస్తుందని ఆరోజే ఆయన గుర్తించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన బలంగా కోరుకనే వారు. నేడు శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆయన ఆశయాలను సాకారం చేస్తున్నారు. కందుకూరి ఆశయాల స్ఫూర్తిగా విద్యార్థినులు చదువుకుంటూ పలు క్రీడల్లో రాణిస్తున్నారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

రాజస్థాన్‌లోని పిందవరలో ఉన్న మాధవ్ విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 22 నుంచి 24 వరకూ వివిధ అంశాలపై క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మకమైన పోటీల్లో కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచారు. ఎం.నాగదేవి, జె.గాయత్రి, ఎస్.రూపగంగాభవాని, సీహెచ్ సాయిలలిత జాతీయ స్థాయిలో రోప్ స్కిప్పింగ్‌లో మొదటిస్థానం కైవసం చేసుకున్నారు. అంతే కాకుండా ఆల్ ఇండియా ఓవరాల్ చాంపియన్ షిప్ ఫర్ ఉమెన్ 2024–25లో మూడవ స్థానంలో నిలిచి కళాశాలకు గర్వకారణమయ్యారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.సుధారాణి, ఏ.నాగు విద్యార్థుల నిరంతర కృషి, పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.

పోలీస్ ఉద్యోగం సాధిస్తా



నేను పోలీస్ ఉద్యోగం సాధించి సమాజానికి సేవ చేయాలనుకుంటున్నాను. మహిళలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను పరిష్కరించాలనుకుంటున్నాను. చదువుతో పాటు కబడ్డీ, రోప్ స్కిప్పింగ్‌లో రాణిస్తున్నాను.

– సీహెచ్. సాయిలలిత, డిగ్రీ ఫైనల్ ఇయర్

క్రీడల్లో సత్తా చాటుతాం



జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచాం. నాకు వ్యక్తిగతంగా క్రీడలంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. వాలీబాల్, హ్యాండ్ బాల్, రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చాటి మెడల్స్ సాధించాను.

– ఎస్.రూపా గంగాభవాని, బీఎస్సీ ప్రథమ సంవత్సరం

ప్రోత్సాహం మరువలేనిది



మా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి ప్రోత్సాహం మరువలేనిది. చదువుకి ఆటంకం రాకుండా మా కోసం ప్రత్యేక తరగతులు చెప్పిస్తున్నారు. ప్రాక్టీస్ సమయంలో హాజరుకాని సబ్జెక్ట్‌లను మరలా మా కోసం తిరిగి బోధించడం వల్ల మేము చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తున్నాం.

– గాయత్రి, బీఎస్సీ, ప్రథమ సంవత్సరం

ఆనందంగా ఉంది



రోప్ స్కిప్పింగ్‌లో జాతీయ స్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తాను. క్రీడల్లో రాణిస్తూ లక్ష్యాన్ని చేరుకుంటాను. ప్రిన్సిపాల్ రాఘవకుమారికి, పీఈడీ టీచర్స్ సుధారాణి, నాగులు ప్రోత్సహిస్తున్నారు.

– ఎం. నాగదేవి, బీఎస్సీ, ద్వితీయ సంవత్సరం

భరత్‌రామ్ పరామర్శ



హాస్పిటల్‌లో అనసూయను పరామర్శిస్తున్న భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయాలపాలైన గోపాలపురం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ఆచంట అనసూయను, ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ పరామర్శించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అనసూయ ఆరోగ్య పరిస్థితిని ఆయన వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు శనివారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ గ్రంధి వెంకటరామజగన్నాథం, అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీనివాసరావు, కార్యదర్శి అప్పన వెంకటరామమూర్తి, జాయింట్ సెక్రటరీ శీరం దుర్గాప్రసాద్, ట్రెజరర్ యలమర్తి రామచంద్రమూర్తి, జాయింట్ ట్రెజరర్ కందుల శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ చోడవరపు లక్ష్మీనారాయణరావు తెలిపారు. అమ్మవారి జయంతోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. 4వ తేదీన చండీ హోమం,7న గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు.

పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ధర్మరాజు



యర్రమోతు ధర్మరాజు

ధవళేశ్వరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ ఎస్‌జీఆర్‌ఈఏ) ధవళేశ్వరం యూనిట్ నూతన అధ్యక్షుడిగా యర్రమోతు ధర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా యర్రమోతు ధర్మరాజు ప్రధాన కార్యదర్శిగా దువ్వూరి కామేశ్వర శర్మ, కోశాధికారిగా ఉర్రింకల సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా దాసరి సాయిబాబు, టి.కేశవరావు, ఉపాధ్యక్షులుగా శ్రీరంగం వెంకటేశ్వర్లు, కె రామారావు, కొండా సూర్యనారాయణ, బుగ్గా సత్య సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్ విజయ మోహన్, సంయుక్త కార్యదర్శిగా అంజూరి సూర్యారావు, కొంజర్ల వెంకటరత్నం, సీహెచ్ నరసింహారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అరప సత్యనారాయణ మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. హక్కుల పరిరక్షణకు అవిశ్రాంత కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు యరమోతు ధర్మరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పెయ్యల సత్య ప్రసాదరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరవధిక సమ్మె



కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌వోల నిరవధిక సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి బొమ్మూరు సెంటర్ నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె ప్రాంతం వరకు ర్యాలీ నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అధిక సంఖ్యలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో రోబోల వినియోగం



ఫార్మా రోబో క్షేత్ర ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

రాజానగరం: వ్యవసాయ రంగంలో రోబోల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరగడంతోపాటు సాగు ఖర్చులను తగ్గించి, రైతుల జీవనోపాధిని మెరుగుపరచవచ్చని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. జీజీయూలో శుక్రవారం నిర్వహించిన ఫార్మా రోబో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రస్తుతం వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినయోగం పెరుగుతోందన్నారు. బీటెక్, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ఆధునిక ఆలోచనలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు చేకూర్చేలా పరిశోధనలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆ స్ఫూర్తిని తీసుకురావడం కోసమే తరచూ ఇటువంటి కార్యక్రమాలకు జీజీయూ నిర్వహిస్తోందన్నారు. జీజీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, ఫార్మా రోబో ఎండీ వజ్రాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సన్‌స్ట్రోక్



నిత్యం రద్దీగా ఉండే రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ శుక్రవారం మధ్యాహ్నం ప్రయాణికులు లేక వెలవెలబోయింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండ వేడిమి, ఉక్కబోత తాళలేక ప్రయాణికులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో మధ్యాహ్నం బస్సులు, బస్టాండ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

– 'సాక్షి' ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

యువకుడిపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ: ఎలాంటి చెడు వ్యసనాలు లేని అమాయక యువకుడిపై తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్య తీసుకోవాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు డిమాండ్ చేశారు. క్వారీ ప్రాంతంలోని 49వ వార్డు సుబ్బారావు నగర్‌లో ఇరుగుపొరుగు మధ్య ఇంటి వివాదంలో అమాయక యువకుడి భవిష్యత్తును దెబ్బతీసేందుకు ఒక పథకం ప్రకారం కొందరు జిల్లా ఎస్పీకి గ్రీవెన్స్‌లో తప్పుడు ఫిర్యాదు చేశారని, దీంతో త్రీటౌన్ పోలీసులు విచారణకు రావడంతో యువకుడి తల్లి అభ్యర్థన మేరకు తాను ఆ కుటుంబానికి అండగా నిలిచినట్లు కొండబాబు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానికులను కలిసి గుత్తుల భానుప్రసాద్ ప్రవర్తనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావునగర్‌లో నివసిస్తున్న గుత్తుల లక్ష్మి కుటుంబానికి పక్క ఇంటిలో నివసిస్తున్న షేక్ శ్రీను రెండో భార్య షేక్ సాయితో కొన్నేళ్లుగా సివిల్ తగాదా కోర్టులో నడుస్తోంది. లక్ష్మిని ఆ ఇంటి నుంచి వెళ్లగొట్టేందుకు ఆమె కుమారుడు భానుప్రసాద్ వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా మద్యం తాగి తమ ఇంటిలోకి ఖాళీ సీసాలు విసురుతున్నాడంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని కొండబాబు తెలిపారు. అమాయక యువకుడి కుటుంబానికి అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా చూస్తామని కొండబాబు హామీ ఇచ్చారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఈనెల 12 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు మే 5వ తేదీ వరకు పొడిగించినట్టు ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం శుక్రవారం తెలిపారు. 3వ తేదీ వరకు ఇచ్చిన పరీక్ష ఫీజు గడువును 12 వరకూ పొడిగించారని, ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఇచ్చిన గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

మూగజీవాలను ఆదరించండి



కుండీలు పంపిణీ చేస్తున్న పంతం కొండలరావు

రాజమహేంద్రవరం సిటీ: వేసవికాలంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంతం సత్యనారాయణ చారిటబుట్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నామన వాసు, లలితా నగర్ ఫ్రెండ్స్ సర్కిల్ సహకారంతో నామన ధనరాజు జ్ఞాపకార్థం ఏటా వేసవిలో మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు స్థానికులకు నీటి కుండీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ తొలి విడతలో 300 కుండీలను పంపిణీ చేశామన్నారు. నాటి నుంచి ఏటా నీటి కుండీల పంపిణీని నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టు పంపిణీ చేసిన నీటి కుండీలను కొంతమంది స్థానికులు సక్రమంగా వినియోగించడం లేదన్న విషయాన్ని గుర్తించామన్నారు. నీటి కుండీల్లో నీళ్లు పోసి, మూగ జీవాలకు అందుబాటులో ఉంచాలన్నారు. తమ ట్రస్టును సంప్రదిస్తే ఉచితంగా నీటి కుండీలను అందజేస్తామని కొండలరావు తెలిపారు. వీధి కుక్కలను నియంత్రించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందని, దీనికి స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులు, ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడంపై లలితానగర్ వాసులకు అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలితానగర్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు నామన వాసు, రాజమండ్రి జైన్ సేవాసమితి ప్రతినిధి రాజ్ కఠారియా, నండూరి సుబ్బారావు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'పై ర్యాలీ



బొమ్మూరులో కిశోరి వికాసం ప్రారంభోత్సవంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని పంచాయతీ కార్యాలయం వద్ద మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎంలు, అంగవాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బేబీరాణి మాట్లాడుతూ గ్రామాల్లోని 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల కిశోర బాల, బాలికలకు వేర్వేరుగా 12 రోజుల పాటు రోజుకో అంశంపై శిక్షణనిస్తామన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



బొల్లెద్దుపాలెంలో పార్టీ శ్రేణులతో కలసి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన జక్కంపూడి రాజా

కోరుకొండ: దోపిడీ, దౌర్జన్యాలను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని, ఇసుక, మట్టి, ప్రకృతి వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం, గరగలంపాలెంలో నా కార్యకర్తలు–నా కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయడంతో పాటు, ప్రజాసంపదను కాపాడటానికి అవిశ్రాంతంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీకి బలమైన, నిజాయతీగల క్యాడర్ ఉందన్నారు.పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయకుండా, కోటీశ్వరుల ఆస్తులు పెరిగే విధంగా కూటమిపాలన సాగుతోందన్నారు.

కూటమి పాలనలో రైతుల అవస్థ

మే నెల ప్రారంభమైనప్పటికీ రైతులకు భరోసా కల్పించే విధంగా సహకారాన్నివ్వడం లేదన్నారు. నిబంధనల పేరుతో ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇక్కట్లకు గురిచేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మామిడి, జీడిమామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకులు, కొత్త తరం నాయకులను సమన్వయం చేయడంతోపాటు, వారిలో ఐక్యత పెంచడానికి నా కార్యకర్తలు–నా కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆయన ఈ సందర్భంగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీనాయకులు నక్కా రాంబాబు, బొల్లెద్దుపాలెం సర్పంచ్ కురుమెళ్ల బుజ్జియ్య, గరగలంపాలెం సర్పంచ్ బోడపాటి నాగ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, నాయకులు బోడపాటి కొండబాబు, దేగల బాబులు, కోలా వీరబాబు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	జింఖానా
సూర్యమినీ	:	రైడ్–2
సూర్యప్యాలెస్	:	థండర్‌బోల్ట్స్
స్వామి	:	హిట్–3
శివజ్యోతి	:	హిట్–3
అనుశ్రీ	:	హిట్–3
రాజా	:	హిట్–3
ఊర్వశి	:	హిట్–3
మేనక	:	అర్జున్ సన్ఆఫ్ వైజయంతి
రంభ	:	గుడ్‌బ్యాడ్‌అగ్లీ, అన్‌టిల్‌డాన్
కుమారి	:	సారంగపాణిజాతకం
అప్సర	:	రెట్రో
అశోక	:	రెట్రో
నామవరం		
విఎస్‌మహల్	:	హిట్–3
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	హిట్–3
కడియం		
వెంకటసూర్య	:	హిట్–3